# పాత పరిచయం

[గల్పిక]

తన్ను చూడ్డానికి వచ్చిన భాస్కరావును చూడగానే పార్వతి బుర్రలో ఏదో సంచలనం కలిగింది. అతన్ని పెళ్లాడా లని ఉందా, ఆడరాదనిఉందా తనమనస్సులో?

అతనికి దాదాపు 30 ఏళ్లుండవచ్చును. తనకు పధ్నా లుగో ఏడిప్పుడే ప్రవేశించింది! ఇద్దరికీ పదహారేళ్లు తేడా. ఇదే మన్నా తనను బాధిస్తున్నదా?

తనను బాధిస్తున్నది అదికాదని పార్వతి రూఢిచేసుకుంది. మరేమిటి?

"నీకిష్టమేనటే, అమ్మా?" అని తల్లడిగినప్పుడు పార్వతే మీ చెప్పలేకపోయింది. పిల్లసిగ్గుపడుతున్నదని తల్లిఅనుకుంది.

భాస్కరావు అందంగానే ఉన్నాడు. చలాకీగాకూడా మాట్లాడాడు. అతన్ని చూస్తే పార్వతికి ఏదో ఒకవిధమైన ఆనందం కలుగుతున్నమాట నిజమేగాని ఆ ఆనందం వెంట ఇంకేదోకూడా కలుగుతున్నది.

"ఏమిటది?"

పార్వతి అకస్మాత్తుగా ఉలికిపడ్డది. ఆమె ఆలోచనా ప్రయత్నం ఫలించింది. ఇతన్ని—ఈమొహం——తనుపూర్వం చూసింది. అయిదేళ్ళ క్రితం, బాపట్లలో.

బాపట్లలో ఆ వీర్రాఘవులుగారమ్మాయి ఉండేది. తన స్నేహితురాలు. వాళ్ళింటిపక్కనే ఆపంతులమ్మ ఉండేది. ఎంత బాగుండేదిపంతులమ్మ! కోపమన్నమాట లేదు. నవ్వు మొహం.

ఒకరోజు రాత్రి, తను వీర్రాఘవులుగారింట్లో పడుకున్న ప్పుడు, తన స్నేహితురాలు, బాగా పొద్దుపోయిన వేళ, "నీకో తమాషా చూపిస్తారావే!" అని తనను పిలుచుకు పోయింది.

చప్పుడు చెయ్యకుండా పిల్లిలాగా అడుగులో అడుగు వేసు కుంటూ అది పంతులమ్మగారి దొడ్డివాకిలి వేపు దారితీసింది. తనకు గుండెల్లో రైళ్లు పరిగెత్తినై. దానికెంతధైర్యం! తనకు ముందుకు పోబుద్ధి పుట్టకపోయినా పిరికిదనిపించుకోవటం ఇష్టంలేక ముందుకు సాగింది.

ఆతరవాత ఇద్దరూ తలుపు కంతల్లోనించి చూచారు!

ఆ దృశ్యం ఇంకా తనకళ్లముందాడుతునే ఉంది. ఆపంతు లమ్మ చాపమీద కూర్చుని ఉంది. ఆమెపక్కనే పడుకుని ఉన్నాడు. ఆమెఒళ్లంతా ప్రేమగా తడువుతూ, మధ్యమధ్య ఆమెను తనమీదికి వంచుకుని చాలాచాలాసేపు ముద్దుపెట్టు కుంటూ—ఇతనే!

ఈ భాస్కర్రావే! ఈమొహమే! ఇదేజుట్టూ, కళ్లూ! అప్పుడు కొట్టుతున్నట్టే పార్వతిగుండె మళ్లీ కొట్టుకోసాగింది.

ఆపంతులమ్మమీద తనకప్పుడు కోపంవచ్చిందా, లేదా, పార్వతి తేల్చుకోలేకపోయింది.

ఆమనిషేతనభర్తా? తను ఇటువంటి పెళ్లికిఒప్పుకోగలదా? సమాధానం తెలీలేదు...ఆపంతులమ్మను ఎంత ఆపేక్షగా చూశాడూ!

"ఏమే, అమ్మా! మీఅమ్మ అడిగితే చెప్పలేదుటగా? కుర్రాణ్ణి చూశావుగా? నీకిష్టమైనట్టేనా?" అన్నాడుతండ్రి.

"నాకు తేలీదు, నాన్నా!" అని పచ్చి నిజంచెప్పింది

పార్వతి, పార్వతికి తన్నుచూస్తే తనకే మండిపోయింది. ఇత నాపంతులమ్మతో సరసాలాడటం కళ్లారాచూసికూడా తను ఎందుకు తేల్చుకోలేదూ?

పార్వతి కిష్టమైనట్టే భావించుకోబడింది.

లగ్నాలు పెట్టుకున్నారు. పార్వతి ఇంకా నిర్ణయానికి రాలేదు. పెళ్ళిరోజు వచ్చింది. పార్వతి ఆలోచిస్తూనే ఉంది. లగ్నం అయిపోయింది. పార్వతిమెళ్లో మూడుముళ్లూ పడినై.

"నన్నుకూడా అట్లానే ముద్దుపెట్టుకుంటాడు!" అనుకుంది పార్వతి. ఆమెరోమాలన్నీ నిక్కబొడిచినై.

అగ్నిహోత్రంముందు కూర్చునిఉండగా ఎవరో వచ్చి, "గోపాలం వచ్చాడురా!" అని పెళ్లికొడుకుతో అన్నారు. భాస్కర్రావుచప్పున వెనక్కుతిరిగి, 'ఏడీరమ్మను!' అన్నాడు.

తనభర్త, గోపాలం అనేవాడికోసం అరనిమిషకాలంలో అయిదుసార్లు వెనక్కుతిరిగిచూడటం పార్వతి గమనించింది.

"ఏంరోయి, పెళ్ళికొడకా! ఏదీ మామరదలు?" అంటూ ఎవరో వచ్చి తనపక్కనే నిలబడ్డారు.

పార్వతి తలకాయ పైకెత్తి చూసింది.

అదేమొహం! అదేజుట్టూ, కళ్ళూ!

"వా! మంచిపిల్లను కొట్టేశావురా, తమ్ముడూ! నేనో అయిదేళ్లు చిన్నవాణ్ణయి ఉండగూడదూ?" అన్నాడు గోపాలం పార్వతికళ్ళల్లోకి నవ్వుతూ చూస్తూ.

"పెళ్లికూతురు కళ్లల్లోకి పొగపోతున్నట్టుంది, కాస్తనిప్పు విసర్రాదూ, పళ్లకొడకా?" అన్నదో ముసలి ముత్తయిదువు.